క్లుప్తంగా

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు



సూచనలు ఇస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: రక్షిత మంచినీటి పైప్‌లైన్ లీకేజీలు లేకుండా మరమ్మతు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో లీకేజీలు అవుతున్న పైప్‌లైన్‌లను మరమ్మతులు చేయించారు. సుల్తానాబాద్, సుగ్లాంపల్లి పుసాలలో పైప్‌లైన్ ద్వారా మంచినీరు సరఫరా అవుతున్నందున లీకేజీ లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం సీజన్ కావడంతో సీజనల్‌వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రోగ్రాం అధికారి దుర్గారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలో విద్యార్థులు ర్యాలీతీశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యుత్‌ను ఏలా పొదుపుగా వాడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎం కమలాకర్, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు సదానందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెడికోలు విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



మెడికోను సన్మానిస్తున్న ఫయాజోద్దీన్

గోదావరిఖనిటౌన్: స్థానిక అడ్డగుంటపల్లిలోని ఆల్ఇల్మ్ పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన మెడికోల సన్మానం కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ తల్హా ఫయాజుద్దీన్ హాజరై మాట్లాడారు. మెడికోలు నైతిక విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. సేవా భావంగల పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభగల మెడికోలను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. డాక్టర్లు మెడికో విద్యార్థులు, ఎస్ఐవో, జీఐవో విద్యార్థులు, టిమ్రీస్ కౌన్సిలర్లు, ఖమ్మం–టిమ్రీస్ ప్రిన్సిపాల్ అబిదా సల్మా, జేఈహి నాయకులు అబ్దుల్ మన్నాన్, మౌలానాశాఖీర్, ఖాజీ మహమ్మద్, ఇస్మాయిల్ నిజామీ, యూసుఫ్, ఫాతిర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దపల్లిరూరల్: బషీర్‌బాగ్ పోలీసుల కాల్పుల్లో అమరులైన వారికి సోమవారం అంబేడ్కర్ విగ్రహంవద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. విద్యుత్‌రంగాన్ని ప్రైవేటీకరించి, ఛార్జీలు పెంచేందుకు పాలకులు చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమంపై ఆనాటి పాలకులు బషీర్‌బాగ్ వద్ద కాల్పులు జరిపి బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ ప్రాణాలను బలిగొన్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. ఆనాటి నుంచి పాలకులు నూతన విద్యుత్ చట్టం పేరిట విద్యుత్‌రంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకే మొగ్గు చూపుతున్నారని ఆరోపించారు. నాయకులు రవీందర్, జ్యోతి, అశోక్, దిలీప్, వెంకటస్వామి, ఖాజా లక్ష్మి, లక్ష్మణ్ తదితరులున్నారు.

అర్హులైన జర్నలిస్టులకు దళితబంధు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: అర్హులైన జర్నలిస్టులకు దళితబంధు పథకం వర్తింపజేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం విన్నవించారు. జర్నలిస్టులుగా పనిచేస్తున్న దళితులకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యమివ్వాలని చంద్రమౌళి, అశోక్, రాజశేఖర్, శివచారి, ముఖేశ్, రమేశ్, శ్రీనివాస్, సాగర్ కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

చెట్టుకింద వంట..వర్కర్లకు తంటా



ఓదెల: మోడల్‌స్కూల్ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చెట్టుకిందే వండుతున్నారు. వంటలు తయారు చేసేందుకు ఎలాంటి షెడ్డు నిర్మించకపోవడంతో చాలా రోజులుగా చెట్టుకింద వంటలు చేస్తున్నట్లు వర్కర్లు వాపోతున్నారు. చెట్టుకింద వంటలు చేస్తుండడంతో పైనుంచి పురుగులు పడే అవకాశం ఉంటుందని విద్యార్థులు, తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలాఏళ్లుగా చెట్టుకిందనే వంటచేస్తున్నా ఎలాంటి షెడ్డు నిర్మాణానికి ఎవరూ పట్టించుకోవడం లేదని వర్కర్లు వాపోతున్నారు.

పశువుల అడ్డా



మంథని: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై పశువులు అడ్డా వేస్తున్నాయి. నడిరోడ్డుపై గుంపులు..గుంపులుగా తిష్టవేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. వాహనదారులు స్వయంగా దిగి వాటిని పక్కకు తప్పిస్తే కాని వాహనం ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. గాంధీచౌక్, బతుకమ్మ చౌక్, అంబేడ్కర్ చౌక్ ఇలా ఎక్కడా చూసినా పశువుల సంతవలే గుంపులుగా దర్శమిస్తున్నాయి. పశువుల యజమానులను మున్సిపాలిటీ మైక్‌ల ద్వారా పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోంది.

ఉచిత వైద్యశిబిరం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని సాంబయ్యపల్లిలో సోమవారం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు సృజన్, మధుకర్‌రెడ్డి, సంతోష్, సూపర్ వైజర్ వెంకటరెడ్డి, తదితరులున్నారు.

గంగాప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలి

గోదావరిఖని: ఓసీపీ–3 పైలట్ క్వారీలో జరిగిన ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్య తీసుకోవాలని, మృతుడి కుటుంబాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు బుర్ర తిరుపతి, ఎంఏగౌస్, శనిగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తి కోసం ప్రాణాలర్పించిన మృతుడి కుటుంబానికి పర్మినెంట్ కార్మికులతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలన్నారు.

సైబర్ క్రైం, షీటీంలపై అవగాహన పెంచుకోవాలి

- మహిళల రక్షణనే పోలీసు బాధ్యత
- సైబర్ మోసాలపై అప్రమత్తం కావాలి
- మంథని సీఐ సతీశ్



పోలీసులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



గొడుగులతో విద్యార్థులు

జూలపల్లి/కమాన్‌పూర్/ముత్తారం: మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులను నివారించడమే పోలీసు బాధ్యతని మంథని సీఐ సతీశ్ పేర్కొన్నారు. సోమవారం ముత్తారం మండలం ధర్యాపూర్ మోడల్ స్కూల్‌లో మహిళల భద్రత..పోలీసుల బాధ్యత అనే కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు షీటీంలు, సైబర్ క్రైం విధులపై అవగాహన పెంచుకోవాలని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, మంథని ఎస్సై కిరణ్, కమాన్‌పూర్ ఎస్సై బేతి రాములు అవగాహన కల్పించా రు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లి మైనార్టీ పాఠశాలలో, జూలపల్లి మండలంలోని ఆదర్శపాఠశాల, కళాశాలలో, కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచే పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థులకు సైబర్‌మోసాలు, ఉమెన్ సేఫ్టీపై, షీటీమ్స్, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఏదైనా ఆపద వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ ఆన్‌లైన్ మోసాలపై తల్లిదండ్రులకు, తెలిసిన వారికి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థినులు సీఐ సతీశ్, ఎస్సై మధుసుధన్‌రావుకు రాఖీ కట్టారు. ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. పోలీసులకు విద్యార్థులు రాఖీలు కట్టారు. ఎస్సై–2 రాణివర్మతో పాటు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ,, హెచ్‌ఎం కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పోలీసులు ఉన్నారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

పాలకుర్తి/ధర్మారం: పాలకుర్తి మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో, ధర్మారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. కాకా వెంకటస్వామి ఫౌండేషన్ తరుపున వివేక్ యువసేన అధ్యక్షుడు గొట్టపర్తి నరేశ్ ఆధ్వర్యంలో యువసేన పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మల్లిఖార్జున్ పాల్గొని విద్యార్థులకు గొడుగులు అందించారు.

మూడో తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే

మంథని: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా పాఠశాలల్లో మూడు రోజుల పాటు ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఈవో దాసరి లక్ష్మీ తెలిపారు. మూడోతరగతి స్థాయిగా తీసుకొని తెలుగు, ఇంగ్లీష్, గణితంలో అభ్యసన ఫలితాలు ఏలా ఉన్నాయో సర్వేచేస్తారు. బుధవారం వరకు మూడో తరగతి విద్యార్థులు పాఠశాలకు హాజరుకావాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ రాష్ట్రానికే ఆదర్శం



విగ్రహానికి పూలమాల వేస్తున్న మంథని సత్యం

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/మంథని/రామగిరి: ఎస్సీ, డిక్లరేషన్ రాష్ట్రానికే ఆదర్శమని కాంగ్రెస్ నాయకులు యుగేంధర్, పెద్దెల్లి ప్రకాశ్ పేర్కొన్నారు. చేవేళ్ల ప్రజాగర్జన సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించడంతో కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలోనే దళిత, గిరిజనులకు మేలు కలిగిందని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్‌గౌడ్‌తో కలసి క్షీరాభిషేకం చేశారు. రామగిరి మండలంలోని మార్కెట్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మంథని రవీందర్ క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మండల అధ్యక్షుడు రాకేశ్ మంథని ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే డిక్లరేషన్ ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తోనే దళితుల అభివృద్ధి సాధ్యమని దళిలు కాంగ్రెస్‌కు మద్దతు పలకాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను గ్రామగ్రామాన దళితులకు తెలిపి కాంగ్రెస్ విజయానికి కృషిచేయలన్నారు.

ఆలయాల పునర్నిర్మాణాలకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



భూమిపూజ చేస్తున్న పూజారులు

జ్యోతినగర్/సుల్తానాబాద్‌రూరల్/గోదావరిఖని టౌన్: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్‌లోని చిలుకలయ్య ఆలయం ఆవరణలోని రామాలయం పునర్నిర్మాణానికి సోమవారం రామగుండం ఎమ్మెల్యే పాల్గొని భూమిపూజ చేశారు. ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సుల్తానాబాద్‌రూరల్ మండలం తొగర్రాయి గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కొలిపాక నర్సయ్య రూ.50వేలు విరాళం అందించారు. హనుమాన్‌నగర్ ప్రధాన చౌరస్తాలోని శ్రీకృష్ణార్జున ఆలయం పునర్నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సంఘటన్ మంత్రి ముడుపు యాదిరెడ్డి భూమిపూజలో పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు...

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు కర్ణె అశోక్‌శర్మ పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దీప ధూప నైవేద్యాలు అందించారు.

భక్తులకు అన్నదానం...

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పుసాల మార్కండేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో శ్రావణ సోమవారం సందర్భంగా సుల్తానాబాద్ శివాలయంతో పాటు శాస్త్రినగర్, పూసాల శివాలయాల్లో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించి 350 మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



విద్యార్థులతో మాట్లాడుతున్న మక్కాన్ సింగ్



కార్మికులకు రాఖీ కడుతున్న జనరల్ సెక్రటరీ లలిత,



రాఖీలు కడుతున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని కాకతీయ జూనియర్, డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ హాజరై విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు మక్కాన్ సింగ్‌కు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూవాహిని ఆధ్వర్యంలో..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలోని పలు విద్యాసంస్థలో హిందూవాహిని ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. సోమవారం టీటీఎస్‌లోని జెడ్పీహైస్కూల్, విశ్వభారతి, రావూస్ మైటెక్నో స్కూల్స్‌లో విద్యార్థులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో చందనగిరి శివ, గోలివాడ శ్రీకాంత్, బాపు, సాయి హిందూవాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులకు..

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని శానిటేషన్ కార్మికులకు సోమవారం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లలిత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ కమిషన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి ఆడేపు శ్రీనివాస్, ఎండీ. హుస్సేన్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే అర్హతలేదు'

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లవుతున్నా హామీలను నేరవేర్చలేదని మళ్లీ ఓట్లు అడిగే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని బీఎస్పీ డివిజన్ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి, ఐతరాజుపల్లి గ్రామాల్లో సోమవారం మన ఊరు–మన ఉష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ఉష ఇంటింటికి తిరుగుతు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ప్రజలకు మేలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ కన్వీనర్ సవిత, మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్న, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, మండల ఉపాధ్యక్షులు భూమయ్య, రాములు, ప్రధానకార్యదర్శి నర్సయ్య, నాయకులు చంద్రశేఖర్, శారద, రవికుమార్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ టికెట్ లక్ష్మణ్‌కు ఇవ్వాలి

ఎలిగేడు: పెద్దపల్లి అసెంబ్లీకి బీఆర్‌ఎస్ టికెట్ బీసీ నాయకుడు పద్మశాలీ సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌కు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎలిగేడు మండలకేంద్రంలో పద్మశాలీ సంఘం సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానించారు. రానున్న ఎన్నికల్లో దాసరి మనోహర్‌రెడ్డికి పద్మశాలీల ఓట్లు వేయబోమని తీర్మానించారు. సంఘం నాయకులు బింగి రాజు, వెంగళదాసు భాస్కర్, కట్ల సత్యం, కట్లప్రకాశ్, బొద్దుల వెంకన్న, సాయినాథ్, వెంగళదాసు రాజమౌళి, కుమారస్వా మి, దూడెం వీరేశం, సత్యనారాయణ, రవి, ప్రభాకర్, రాజమల్లయ్య, మల్లేశ్, కనుకయ్య, రమేశ్, పెంటయ్య, రాజేశం, శంకరయ్య, రవీందర్, పాల్గొన్నారు.

దీన్‌దయాల్ స్పర్శ్‌కు దరఖాస్తులు

గోదావరిఖనిటౌన్: దీన్‌దయాల్ స్పర్శ్ ప్రోగ్రాంలో భాగంగా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని గోదావరిఖని సబ్‌డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మేరుగు శ్రీనివాస్ తెలిపారు. అకాడమిక్ రికార్డు కలిగిన విద్యార్థిని పోటీ ప్రక్రియతో ఎంపిక చేస్తామన్నారు. స్కాలర్‌షిప్ సంవత్సరానికి రూ. 6వేలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు పోస్టాఫీస్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తు ఫారం పోస్టాఫీసులో లభిస్తాయని సెప్టెంబర్ 8లోపు దరఖాస్తులను పోస్టాఫీసులో అందించాలన్నారు.

నిధులు మంజూరు చేయండి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ కిరాణా వర్తక సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించారని త్వరలో నిధులు మంజూరు చేస్తారని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ పట్టణ కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు పల్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి చేపూరి రవీందర్‌గౌడ్, టీఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్ చందర్‌రావు, ముత్యం రమేశ్, గౌరవ అధ్యక్షుడు కొల్లూరు అశోక్, ఉపాధ్యక్షుడు కే. రమేశ్ కొండయ్య, సహాయ కార్యదర్శులు తదితరులు ఉనారు.

భూములను ధరణిలో నమోదు చేయండి

రామగిరి: మండలంలోని బుధవారంపేటలోని 708.16 ఎకరాల వ్యవసాయ భూమిని యథావిధిగా ధరణిలో నమోదు చేయాలని రాజాపూర్ సర్పంచ్ పాశం ఓదెలు, బుధవారంపేట ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, అక్కెపల్లి వార్డు సభ్యులు సిద్ధ శ్రీధర్ ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్నట్లు ప్రజలకు తప్పుడు నోటిఫికేషన్లు జారీ చేసి రైతులపేర్లు ధరణినుంచి తొలగించి అన్యాయం చేశారని, రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయ రుణాలకు దూరమవుతున్నామని పేర్కొన్నారు.

రామగిరి, సింగరేణి రైళ్లను యథావిధిగా నడిపించాలి

ఓదెల: కాజీపేట్, భద్రాచలంరోడ్ నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే రామగిరి సింగరేణి రైళ్లను యథావిధిగా నడిపించాలని ఓదెల మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దొడ్డిస్వామి పేర్కొన్నారు. సోమవారం ఓదెల మండలం కొలనూర్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. సింగరేణి రామగిరి రైళ్లను మూడు నెలలుగా రద్దు చేయడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారని, ఆర్థికంగా సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులు, రైతులు, పాలవ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రద్దయిన రైళ్లను యథావిధిగా నడిపించాలని రైల్వేఉన్నతాధికార్లను కోరారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శంకుస్థాపన చేశారు. 36, 44, 45వ డివిజన్ల పరిధిలోని తిలక్‌నగర్‌లో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మేయర్ అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి సుమారు రూ.300 కోట్లకుపైగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్లు కొమ్ము వేణుగోపాల్, దొంత శ్రీనివాస్, బాలరాజ్‌కుమార్, నాయకులు రాకం వేణు జేవి రాజు, నీరటి శ్రీనివాస్, సత్యం, అక్షర మల్లేష్, బెండే నాగభూషణ్ గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్

గోదావరిఖని: నియోజకవర్గంలోని కుక్కలగూడూర్ మాజీ సర్పంచ్ శంకరయ్యగౌడ్ బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. సోమవారం స్థానిక మార్కండేయకాలనీ ఫంక్షన్‌హాల్‌లో మాజీలు పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరడం కేసీఆర్ ప్రభుత్వంచేస్తున్న అభివృద్ధి పనులకు నిదర్శనమన్నారు. పాలకుర్తి మండల అధ్యక్షుడు ఇంజపురి నవీన్, అంతర్గాం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రం అభివృద్ధిపై సమావేశం



అభివృద్ధిపై చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

రామగిరి: మండలంలోని బేగంపేట్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క అధ్యక్షతన నిర్వహించారు. తాగునీటి సదుపాయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. గతంలో వచ్చిన రూ.4 లక్షల నిధులపై చర్చించారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఫ్యాన్‌ల మరమ్మతులు, కుర్చీల ఏర్పాటు, ఇతర మరమ్మతులకు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంపత్‌కుమార్, ప్రదీప్, సర్పంచ్‌లు బుర్ర పద్మ, పల్లె ప్రతిమ, ఎంపీటీసీ మారగొని కరుణ, సీహెచ్‌వో భరత్, ఎంసీహెచ్‌వో సీతారామయ్యలు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల్లో వెలుగులు నింపండి



నేత్రదానం కార్డులతో యువ కార్మికులు

గోదావరిఖని: నేత్రదానంతో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించాలని సదాశయ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి సీహెచ్.లింగమూర్తి పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ ఆర్జీ–1 ఎంవీటీసీ, టీటీసీ శిక్షణా కేంద్రాల్లో సోమవారం సింగరేణి ఉద్యోగులకు నేత్ర, అవయవదానంపై అవగాహన కల్పించారు. పలువురు కార్మికులు మరణానంతరం నేత్రదానం చేసేందుకు ముందుకురాగా, వారికి డోనర్ కార్డులను సదాశయ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధి వాసు అందించారు. కార్యక్రమంలో వీటీసీ మేనేజర్ డేనియల్, ఇన్‌స్ట్రక్టర్ వేణుగోపాల్, రాజేశ్వర్, టీటీసీ ఇన్‌చార్జి మేనేజర్ అశోక్‌రావు, స్వామి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున అవయవదానంకు అంగీకారం

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన కొంద్ర శ్రీనివాస్ తన పుట్టిన రోజు సందర్భంగా మరణాంతరం నేత్ర, అవయవదానం చేస్తానని అంగీకారం తెలిపారు. ఈమేరకు కుటుంబ సభ్యుల అనుమతితో శ్రీనివాస్ సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు తన అంగీకారపత్రాన్ని అందించారు. పలువురు అభినందించారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



కాల్వశ్రీరాంపూర్: ఓటుహక్కును వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్ అన్నారు. మండలకేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటుహక్కు, ఓటరుగా నమోదు, ఈవీఎంల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదులో పారదర్శకత పాటించాలని, తప్పులు లేకుండా చూడాలని బీఎల్వోలకు సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన..

కాల్వశ్రీరాంపూర్‌లోని ఒకటి, రెండో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు అందించి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. తహసీల్దార్ జాహెద్ పాషా, ఆర్ఐ వైశాలి, అంగన్‌వాడీ టీచర్లు హాజీరా, సునీత, లెక్చరర్స్ పాల్గొన్నారు.